క్లుప్తంగా

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

మచిలీపట్నంటౌన్: పోస్టల్ శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న పోస్టాఫీస్‌లో పోస్టల్ పథకాల వివరాలు తెలిపే మేళాను ఆమె గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య, పోస్టల్ సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, ఐపీపీబీ సీనియర్ మేనేజర్ కేవీ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి: గ్రామంలో సమస్యలు దశలవారీగా పూర్తవుతాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు అన్నారు. మండల పరిధిలోని పెద తుమ్మిడి గ్రామ సచివాలయం వద్ద గురువారం ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభ జరిగింది. సభలో ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు, డ్రైనేజి, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తొలుత ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి మా మంచి ప్రభుత్వం కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అర్జా యశోదమ్మ, ఓవైపీ చలం, టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, స్థానిక నాయకులు బొల్లా శ్రీను, బొల్లా రవి, మట్టా బ్రహ్మం, మురాల నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది.

కబడ్డీ పోటీలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

నాగాయలంక: స్థానిక హైస్కూల్ గ్రౌండ్స్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి(ఆరు మండలాలు) కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలలో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన ఆరుగురు బాల, బాలికలు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం పీఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. అండర్-17 విభాగంలో కొక్కిలిగడ్డ జాహ్నవి, పి.నైనా, చిన్నం చంటి ఎంపిక కాగా, అండర్-14 విభాగంలో గుంటూరు హాసిని, పి.లీలాశ్రీ, పి.జగన్ ఎంపికయ్యారు. ఈ ఆరుగురు కృష్ణాజిల్లా స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలకు హాజరవుతారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావులను హెచ్‌ఎం ప్రసాద్, పీఎంసీ చైర్మన్ వక్కపట్ల మారుతి అభినందించారు.

200 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ఎంఎక్స్ విజయ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, జాతీయ మానవహక్కుల క్రైం బ్యూరో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నేత్ర వైద్య శిబిరంలో డాక్టర్ జగదీష్ 200 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. తొలుత జాతీయ మానవ హక్కుల క్రైం బ్యూరో కార్యదర్శి పురాణం పద్మజ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

పులిగడ్డలో స్వచ్ఛతా హీ సేవ గ్రామసభ

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో స్వచ్ఛతా హి సేవ గ్రామసభ జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.మరియాదేవి మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్స్‌కు సర్పంచ్ దాసరి విజయకుమార్, ఎంపీడీవో, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు కిట్లు అందించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి అనితతో పాటు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

చిట్టూర్పు(ఘంటసాల): విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని గోగినేనిపాలెం కాంప్లెక్స్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని చిట్టూర్పు(ఆర్), చిట్టూర్పు (ఎస్‌డబ్ల్యూ), జోడుగూడెం ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి, రికార్డులను తనిఖీ చేయడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. ప్రశస్త యాప్‌ను అందరూ ఉపాధ్యాయులు డౌన్ లోడ్ చేసుకుని లాగిన్ అయి పిల్లల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆయా ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

తాగునీటికి ఇక్కట్లు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేసవిలోనూ పుష్కలంగా నీటి సరఫరా
- కూటమి ప్రభుత్వంలో మంచినీటికి ఇబ్బందులు
- ట్యాంకర్ ముందు భైఠాయించి నిరసన తెలిపిన మహిళ


ట్యాంకర్ ముందు భైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళ

మచిలీపట్నంటౌన్: ఓ పక్క కృష్ణా నదికి వరదలు వచ్చి టీఎంసీల కొద్దీ నీరు సముద్రానికి వృథాగా పోయాయి. మరో పక్క జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి కటకట తప్పడం లేదు. నగరంలోని 36వ డివిజన్ రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాల పక్కనున్న కాలనీ వాసులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేసవిలో సైతం ఈ ప్రాంత వాసులు ఇంటింటికీ ట్యాంకర్ ద్వారా డ్రమ్ములు, బిందెల్లో తాగునీటిని పట్టుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచిన తర్వాత ట్యాంకర్‌ను మూడిళ్లకు ఒకచోట ఆపి నీళ్లు పట్టుకోమని, అది కూడా నాలుగు బిందెలే పట్టుకోవాలని నాయకులు ఆదేశాలివ్వడంతో సమస్య మొదలైంది. ఆ మేరకు ట్యాంకర్ డ్రైవర్లు మూడిళ్లకు ఒకచోట ఆపి నాలుగు బిందెలే నీళ్లు పట్టుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా ఈ విధానం అమలు చేస్తుండడంతో ఆ ప్రాంత మహిళలు నీటికి ఇబ్బంది పడుతున్నారు. గురువారం ట్యాంకర్ డ్రైవర్ తేజ మూడిళ్ల మధ్య దాదాపు పది నిమిషాలు మాత్రమే ట్యాంకర్‌ను నిలిపి ఆ ప్రాంత మహిళలు అందరూ బిందెల్లో నీళ్లు పట్టుకోవటం పూర్తికాకుండానే హడావుడిగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ట్యాంకర్‌కు అడ్డుగా కూర్చుని బైఠాయించింది. ఇంకా బిందెల్లో నీరు పట్టుకోకుండానే వెళ్లిపోతే ఎలాగని నిరసన తెలిపింది. డ్రమ్ముల్లో ఎలాగూ పట్టుకోవడం లేదని, కనీసం ఇంటికి నాలుగు బిందెలు కూడా పట్టుకోనివ్వకపోతే ఎలాగని నిలదీసింది. దీనికి డ్రైవర్ తేజ కోపోద్రిక్తుడై ఆ మహిళను దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగాడు. అంతేకాకుండా ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి కొడాలి అంజయ్యకు ఫోన్ చేసి సదరు మహిళపై ఫిర్యాదు చేశాడు. దీంతో అంజయ్యతో పాటు మరో టీడీపీ నాయకుడు అక్కడకు చేరుకుని ట్యాంకర్ ముందు కూర్చుని ఆపటం నేరమని, కేసు అవుతుందని భయపెట్టే ప్రయత్నం చేశారు. కనీసం రెండిళ్ల మధ్యనైనా ట్యాంకర్‌ను పెడితే నీళ్లు పట్టుకుంటానికి అనువుగా ఉంటుందని ఆ మహిళ కోరడంతో చివరకు డివిజన్ ఇన్‌చార్జ్ అంజయ్య రెండిళ్లకు మధ్య ట్యాంకర్‌ను ఆపమని డ్రైవర్ కు సూచించారు. మూడు గృహాల వద్ద పది నిమిషాల పాటు ట్యాంకర్ ను నిలిపిన డ్రైవర్ తేజ 55 నిమిషాలు ఆపానని ఇన్‌చార్జి అంజయ్యకు అబద్ధాలు చెప్పటంపై ఆ ప్రాంత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల తీరుతో కృత్రిమ నీటి ఎద్దడి

నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది తీరుతో నగరంలోని పలు కాలనీలలో తాగునీటికి కృత్రిమ ఎద్దడి ఎదురవుతోంది. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, నగర కమిషనర్ బాపిరాజు దృష్టి సారించి నీటి సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంత మహిళలు కోరుతున్నారు. తమతో తరచూ గొడవలు పడుతున్న డ్రైవర్ తేజను తమ ప్రాంతానికి రాకుండా నిలుపుచేసి, వేరే వ్యక్తిని పంపాలని వారు కోరుతున్నారు.

పెడన పురపాలికలో ఉద్యోగుల బదిలీలు

పెడన: పెడన పురపాలక సంఘంలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వీరిలో కొందరు రిలీవ్ కాగా మరికొందరు అక్టోబరు 2వ తేదీ తరువాత రిలీవ్ కానున్నారు. బదిలీ అయిన వారిలో టౌన్ ప్లానింగ్(టీపీవో) అధికారి వి.ఏసుబాబు గుడివాడకు బదిలీ అయి గురువారం రిలీవ్ అయ్యారు. ఈయన స్థానంలో మచిలీపట్నం ముడా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారి బి.సుజనకుమారి పెడనకు టీపీవోగా రానున్నారు. సీనియర్ అసిస్టెంట్లు పి.సుందరం తాడిగడపకు బదిలీ అయి రిలీవ్ వెళ్లారు. ఈయన స్థానంలో నందిగామ నుంచి ఎస్‌వీ కృష్ణయ్య బాధ్యతలను స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్ చిన వెంకటేశ్వరరావు నందిగామ నుంచి డెప్యూటేషన్‌పై పెడనలో విధులు నిర్వహిస్తున్నారు. డెప్యూటేషన్ రద్దు చేసి నందిగామకు వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. సీనియర్ అకౌంటెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో తాడిగడపలో సీనియర్ అకౌంటెంట్‌గా ఉన్న ఆదీలున్నీసా పెడనకు బదిలీపై రానున్నారు. మరొక సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తాడిగడపకు బదిలీ అవగా ఆయన స్థానంలో నూజివీడు నుంచి రాధిక విధుల్లో చేరారు. సీనియర్ అసిస్టెంట్ పెద్దిరాజును నూజివీడుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూజివీడు పురపాలక సంఘంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యంను నియమించారు. బిల్ కలెక్టర్ కె.రమ్యను గుడివాడకు బదిలీ చేయగా ఆమె స్థానంలో గుడివాడలో బిల్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరరావును పెడనకు నియమించారు.

కూటమి నేతలు ఇసుక, బుసక జోలికెళ్లొద్దు

- ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్
- గృహ నిర్మాణ శాఖ అవినీతిపై విచారణ చేయిస్తాం
- పంచాయతీలకు వచ్చే ప్రతి పైసా సద్వినియోగం చేస్తాం


శ్రీకాకుళం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

శ్రీకాకుళం(ఘంటసాల): కూటమి నేతలు ఎవరూ ఇసుక, బుసక జోలికి వెళ్లొద్దని, అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామ పంచాయతీ ప్రాంగణంలో సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ అధ్యక్షతన గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ 108 దివ్య తిరుపతుల్లో 57వ దివ్య తిరుపతిగా ప్రాచుర్యం పొందిన శ్రీకాకుళం దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. గ్రామంలో రోడ్ల అభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరు చేశామని, సకాలంలో పూర్తి చేస్తే మిగిలిన రోడ్లు పూర్తి చేసేందుకు సహకారం అందిస్తామన్నారు. మండలంలో గృహ నిర్మాణ శాఖలో భారీ అవినీతి, కుంభకోణాలు జరిగాయని వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. యానాదుల ఆధార్ కార్డుల సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. వరదల్లో నష్టపోయిన రైతులకు, ప్రజలకు అత్యధిక ప్యాకేజీ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను సర్పంచ్ రవి ప్రసాద్ సత్కరించగా, వీఏఏలకు జీతాల మంజూరుకు కృషి చేసినందుకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి నాని ఆధ్వర్యంలో వీఏఏలు ఎమ్మెల్యేను సత్కరించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని పలువురు అర్జీలు సమర్పించారు.

ఐసీడీఎస్ సూపర్ వైజర్ డి.మేరీ ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సమక్షంలో జరిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సీనియర్ టీడీపీ నేతలు గొర్రెపాటి రామకృష్ణ, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఎంపీటీసీ కుమార్ రాజా, తెలుగు రావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో పూజ, సంప్రోక్షణ

టీటీడీలో భక్తులకు ఇచ్చే లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగాన్ని నిరసిస్తూ శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర స్వామి వారి ఆలయంలో పూజలు చేసి, సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ జరిపించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ప్రధాన అర్చకులు స్వాగతం పలికి ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

పెడన: వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ ఏర్పడటంతో ఒకరిని ఒకరు తోసుకుంటూ పిడిగుద్దులు గుద్దుకుంటూ చొక్కాలు చించుకునే పరిస్థితి ఏర్పడింది. సేకరించిన, పోలీసులు తెలిపిన వివరాల మేరకు 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ తమ్ముడు శిరివెళ్ల రాజీవ్‌గాంధీ కుమార్తె(3) గురువారం ఉదయం వార్డులోని ప్రధాన రోడ్డు పక్కన బంధువుల(ఇద్దరు యువకులు)తో కలిసి నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో టీడీపీ సానుభూతిపరుడు జి.నాగేంద్ర(17) ద్విచక్ర వాహనంపై స్పీడుగా పాప ముందుకు వచ్చి సడన్ బ్రేక్ కొట్టి బండిని ఆపాడు. పాపను తీసుకువెళ్తున్న యువకులు అంత స్పీడు ఎందుకు, బ్రేక్‌లు పడకపోతే పాప పరిస్థితి ఏమిటంటూ గట్టిగా ప్రశ్నించారు. దీంతో నాగేంద్రం పాపకు ఏం కాలేదు కదా.. అని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఆ యువకులు నాగేంద్రను చొక్కా పట్టుకుని నిలదీశారు. అప్పటికే ఆ ప్రాంతంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కోసం వేచి ఉన్న టీడీపీ స్థానిక నాయకులు నాగేంద్రం చొక్కా పట్టుకున్న యువకులపై దాడికి దిగి, పిడిగుద్దులు గుద్ది చొక్కాలు చింపేశారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తమ్ముడు రాజీవ్‌గాంధీ, మరికొందరు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు సంఘటన ప్రాంతానికి చేరుకోవడంతో పరిస్థితి ఘర్షణలకు దారి తీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరుపక్షాల వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. టీడీపీ వర్గీయులు ఇచ్చిన ఫిర్యాదు తీసుకున్న పోలీసులు వారిని పంపించేశారు. వైఎస్సార్ సీపీ వర్గీయులను మాత్రం సీఐ వస్తారని, మీతో మాట్లాడతారంటూ గంటల కొద్దీ స్టేషన్ వద్దే ఉంచడంపై సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. ఈ విషయమై ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మీనరసింహమూర్తి మాట్లాడుతూ ఇరుపక్షాల నుంచి ఫిర్యాదులు తీసుకున్నామని, వైఎస్సార్ సీపీ వారు వెళితే మళ్లీ అక్కడ ఘర్షణలు ఎక్కువవుతాయనే ఉద్దేశంతో ఇక్కడే ఉంచామని, భవిష్యత్తులో ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ఇరుపక్షాలతో చర్చలు జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వర్షం తెచ్చిన కష్టం!

- భారీ వర్షంతో తీరప్రాంతంలో నీట మునిగిన నారుమళ్లు
- నీటిని బయటకు తరలించేందుకు రైతులకు తప్పని తిప్పలు


హంసలదీవి సమీపంలో గుల్లపంపు సహాయంతో నారుమడిలోని నీటిని బయటకు తరలిస్తున్న రైతు

కోడూరు: 'అయితే అతివృష్టి.. లేకపోతే అనావృష్టి' అనే చందంగా మారింది మండలంలోని తీరప్రాంత రైతుల పరిస్థితి. ఖరీఫ్ సీజన్ ఆరంభమై మూడు నెలల గడుస్తున్నా మండలంలోని తీరప్రాంత గ్రామాలైన హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం, ఉల్లిపాలెం ప్రాంతాల్లో రైతులు నేటి వరకు వరినాట్లు పోసుకోలేదు. సీజన్ ఆరంభంలో సాగునీటి సంక్షోభం తరువాత భారీ వర్షాలతో ఈ ఏడాది వ్యవసాయ పనులను ఆలస్యంగా ప్రారంభించారు. ఈ ప్రాంతాల్లో గత పది రోజుల నుంచే వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. కొంతమంది రైతులు వరి నారుమళ్లు పోసుకోగా, మరికొంతమంది రైతులు పొలాల్లో దుక్కులు దున్నుకోవడం, పార పని చేసుకుంటున్నారు. పది రోజుల క్రితం నారుమళ్లు పోసిన రైతులు అప్పట్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలువల్లో సాగునీరు లేక తీవ్రమైన ఎండలు ఉండడంతో నారుమళ్లను బతికించుకొనేందుకు నానా కష్టాలు పడ్డారు.

భారీ వర్షంతో నీట మునిగిన నారుమళ్లు..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి రాత్రి వేళల్లో భారీ వర్షాలు కురవడంతో వరి నారుమళ్లు నీట మునిగాయి. నారుమళ్లు మొత్తం నీటిలో ఉండిపోవడంతో అవి దెబ్బతినే ప్రమాదం ఉన్నందున నీటిని బయటకు తరలించేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కుటుంబం అంతా పొలాల వద్దే ఉండి కొందరు గుల్లపంపుల సహాయంతో, మరికొందరు స్టీల్ పాత్రలతో నీటిని తోడుతున్నారు. నారుమళ్లు పోసిన తరువాత సాగునీరు లేక ఇబ్బంది పడ్డామని, ఇప్పుడు భారీ వర్షంతో నీరు పొలాల్లో నుంచి బయటకు వెళ్లక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త వేసిన దేవర చిత్రం బ్యానర్ తొలగింపు


కాకర్లమూడి కాలువగట్టుపై తొలగించిన బ్యానర్

పెడన: వైఎస్సార్ సీపీ కార్యకర్త ఒకరు సినీనటుడు జూనియర్ ఎన్టీ రామారావుపై అభిమానంతో వేసిన దేవర సినిమా బ్యానర్‌ను పోలీసులు బలవంతంగా తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాకర్లమూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త యరగాని ఆదినారాయణ శుక్రవారం దేవర సినిమా విడుదల సందర్భంగా బ్యానర్ వేయించాడు. బ్యానర్‌లో జూనియర్ ఎన్టీఆర్ ఫొటోతో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెడన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులతో పాటు మాజీ మంత్రి జోగి రమేష్ ఫొటోలు కూడా వేయించి దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామంలోని కాలువగట్టుపై బ్యానర్ ఏర్పాటు చేశారు. దీనిపై ఎన్డీయే కూటమి నాయకులు రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో వీరబాబు ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ ఆదేశాలతో పెడన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యానర్‌లో గ్రామస్తులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యానాలున్నాయని, శాంతిభద్రతలు తలెత్తే ప్రమాదం ఉన్నందున తక్షణం ఆ బ్యానర్‌ను తొలగించేలా చూడాలని వీఆర్వో ఆ ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. దీంతో పెడన పోలీసులు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి శిరీష సదరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి బ్యానర్‌ను తీయించివేశారు.

పేర్ని నానికి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ నాయకులు

గూడూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)ని గురువారం గూడూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మచిలీపట్నంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నానితో భేటీ అయిన నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులు, ప్రతీకార చర్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, ఎస్సీ సెల్ కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు, ఆర్బీకే మాజీ చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, నాయకులు బత్తిన త్రినాథ్, చండిక పరశురామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● కలుషిత ఆహారం అనారోగ్యానికి కారణం

బంటుమిల్లి: ప్రజల ముఖ్య ఆహారమైన వరి తదితర ధాన్యాలు రసాయనిక ఎరువుల వాడకం కారణంగా కలుషితమై అనారోగ్యాలకు కారణమవుతున్నాయని పెడన మండలం నందమూరు ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకులు అరవింద సత్య అన్నారు. మండల పరిధిలోని అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం సీహెచ్ రామచంద్రరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అరవింద మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందుల కారణంగా తినుబండారాలు కలుషితమై చిన్నతనంలోనే బీపీలు, షుగర్లు తదితర వ్యాధులతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. గో ఆధారిత ఉత్పత్తులను పండించడంలో రైతులను ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా, ధ్యాన సాధన అలవరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివేకానందుని జీవితం, ఆయన ఇచ్చిన సందేశాల పుస్తకాలను పంచిపెట్టారు.

● రేమాలవారిపాలెం గణేశుని లడ్డూ ధర రూ.13 వేలు

రేమాలవారిపాలెం(నాగాయలంక): గ్రామంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల మండపంలో శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి నిమజ్జనోత్సవం పురస్కరించుకుని మండపంలో ఉంచిన లడ్డూ ప్రసాదానికి గురువారం వేలంపాట నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల సమక్షంలో నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో వేలంలో నాగాయలంక వాసి భోగాది శివవిష్ణువర్ధన్, అతని మిత్రబృందం లడ్డూను 13వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఉత్సవాల ఆరంభం సమయంలో దాతలుగా బొమ్మల సుబ్బారావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు-విజయలక్ష్మి దంపతులు తొమ్మిది గ్రాముల వెండి కాయిన్ సమన్విత 11 కేజీల లడ్డూను సమర్పించారు. గ్రామ పెద్ద చోడిశెట్టి మాణిక్యాలరావు చేతుల మీదుగా పాటదారులకు లడ్డూ ప్రసాదం అందజేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు యర్రంశెట్టి నాగపవన్, కృష్ణకుమారి, మత్తి రాజారావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● నందిగామ సర్పంచ్‌గా హరిబాబు బాధ్యతల స్వీకారం

పెడన: వైఎస్సార్ సీపీ మద్దతుతో బొడ్డు హరిబాబు గురువారం నందిగామ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు టీడీపీ మద్దతుతో ఉన్న బొడ్డు చినబాబు ఎన్నిక చెల్లదని హరిబాబు గత ఏడాది కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. దీంతో హరిబాబుతో అప్పటి మండల పరిషత్ అధికారులు ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. అయితే చినబాబు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని మళ్లీ సర్పంచ్‌గా కొనసాగుతూ వచ్చారు. స్టే గడువు ముగిసిందని హరిబాబు మళ్లీ కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఉత్తర్వులను అనుసరించి జిల్లా కలెక్టర్ హరిబాబును సర్పంచ్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో హరిబాబు గురువారం నందిగామ సర్పంచ్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి సుబ్రమణ్యం, జన్ను నాగమల్లేశ్వరరావు, కటికల జోజి, పి.వెంకటస్వామి, యర్రంశెట్టి మహాలక్ష్మయ్య, దామోదరరావు, ఎంపీటీసీ బొడ్డు గుర్నాథం, ఉయ్యూరు బాలాజీ తదితరులు అభినందనలు తెలిపారు.

● విద్యార్థినికి ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని రూప కి విద్యుత్ శాఖ మచిలీపట్నం సబ్ డివిజన్ ఈఈ మన్యం భాస్కరరావు బుధవారం రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్ర మండలి సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా గురువులు గురునాథబాబు, చింతయ్య, రేఖ, రంజిత, యోగ సాధకులు, ఐ అండ్ పీఆర్ డీడీ వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఎడ్లంక వరద బాధితులకు రెహబాత్ మినిస్ట్రీస్ సహాయం

ఎడ్లంక(అవనిగడ్డ): ఉయ్యూరుకు చెందిన రెహబాత్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు మీసాల కాంతారావు ఆధ్వర్యంలో ఎడ్లంక వరద బాధితులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గ్రామంలోని 400 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, వంటనూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలెపు సామ్రాజ్యం, మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, మునిపల్లి వెంకటేశ్వరరావు, పాస్టర్లు ఎం.రత్నరాజు, కరుణాకర శాస్త్రి, కన్నా నాగబసవయ్య, ఇస్సాకుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి పోటీలకు కప్పలదొడ్డి క్రీడాకారులు

గూడూరు: అక్టోబరు 5 నుంచి విశాఖపట్నంలో జరగనున్న అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కప్పలదొడ్డి హైస్కూలుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికై సత్తా చాటారు. ఈనెల 22న నూజివీడులో జరిగిన జిల్లా జట్టు ఎంపికలో పాఠశాలకు చెందిన గూడపాటి బాబీ, పేరిశెట్టి పవన్ నాగ శ్రీసాయి, సేనాపతి ఫణి కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనపర్చారు. దీంతో వీరు ముగ్గురిని వచ్చేనెల 5 నుంచి 7 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.జ్యోతి, పీడీ సి.హెచ్.మురళీకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ బట్ట కోట శివకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు కట్టా మునేశ్వరరావు, జాతీయ క్రీడాకారుడు బి.శివనాగప్రభు తదితరులు అభినందించారు.

● సీనియర్ టీడీపీ నేతలను గుర్తించాలి

శ్రీకాకుళం(ఘంటసాల): పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన సీనియర్ నేతలను గుర్తించాలని టీడీపీ సీనియర్ కార్యకర్త మేకా శ్రీనివాసరావు విజ్ఞప్తిచేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం పంచాయతీ వద్ద గురువారం జరిగిన గ్రామ సభకు విచ్చేసిన శ్రీనివాసరావు సభ అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను దుశ్శాలువాతో సత్కరించేందుకు స్టేజి పైకి వచ్చారు. ఆయన సీనియర్ కావడంతో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ అదే శాలువాతో శ్రీనివాసరావును సన్మానించారు. అందరూ స్టేజి దిగుతూ ఉండగా మైక్ తీసుకున్న మేకా శ్రీనివాసరావు పార్టీ అధికారంలోకి వచ్చాక సీనియర్లను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన దగ్గర నుంచి టీడీపీలో ఉంటున్నానని, ఇప్పుడున్న నేతలు సీనియర్లను గుర్తించడం లేదంటూ మైక్‌లో చెప్పడంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారు.

● నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో శుక్రవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినట్లు విద్యుత్ శాఖ మచిలీపట్నం సబ్ డివిజన్ ఈఈ ఎం.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చిమ్మనగిరిపేట, బలరామునిపేట, గాంధీ బొమ్మ శివాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● తడి, పొడి చెత్తలపై అవగాహన అవసరం

పెడన: తడి, పొడి చెత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. ఆయన గురువారం పట్టణంలోని 20వ వార్డులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో 20వ వార్డు కౌన్సిలర్ కొసనం కరుణ కుమారి, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండి మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని మచిలీపట్నం మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు జి.రమేష్‌బాబు, మస్తాన్‌ఖాన్ అన్నారు. స్థానిక రుస్తుంబాదలోని ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బాలలపై లైంగిక నేరాలు, బాల్యవివాహాలు, వాటికి పడే శిక్షల వివరాలను వారు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నేరాల దరిచేరకుండా చదువే పరమావధిగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బాల్య వివాహాలను అరికట్టాలంటూ ర్యాలీ

కోడూరు: బాల్య వివాహాలను అరికట్టాలంటూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాలికలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయరాదంటూ సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని గ్రామ పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై కూడా సూచనలిచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వి.ఉమాదేవి, రజియాబేగం, రాణి, మృదుభాషిణి పర్యవేక్షణలో ర్యాలీ జరిగింది. ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేశ్వరమ్మ, ఏఎన్‌ఎం ధనలక్ష్మి, మహిళా పోలీస్ మారుతి పాల్గొన్నారు.

● నాగాయలంక యూటీఎఫ్ అధ్యక్షుడిగా తెనాలి శ్రీనుబాబు

నాగాయలంక: యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా తెనాలి శ్రీనుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడుగా ఎస్‌బీబీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బండ్రెడ్డి సాంబశివరావు, సహాధ్యక్షులుగా మండల నాంచారమ్మ, పీతా వీర వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మద్దిమురళి ఎన్నికయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com